క్లుప్తంగా

నాడు నేడు పనుల పరిశీలన

ముదిగుబ్బ: మండల పరిధిలోని బీడుమర్రి, గంగిరెడ్డిపల్లి, కొడవండ్లపల్లి, మర్తాడు తదితర పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను బుధవారం ఎంఈఓ సుధాకర్‌నాయక్ పరిశీలించారు. పురోగతి ఫొటోలను ప్రతి వారం యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందికి సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి పాఠశాలలో పరిశుభ్రమైన తాగునీటి వసతి కల్పించాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



ఆనంద్‌నాయక్, ఆయన సతీమణిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

కదిరి అర్బన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న కదిరి మండల వైస్ ఎంపీపీ ఆనంద్‌నాయక్, ఆయన సతీమణిని బుధవారం ఆస్పత్రికి వెళ్లి ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. డిశ్చార్జి అయ్యాక కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రకాష్, అగ్రి అడ్వైజరీ బోర్డు జిల్లా మెంబర్ సుధీర్‌రెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠనాయక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఉమర్ ఫరూఖ్‌కు సన్మానం



ఉమర్ ఫరూఖ్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

ధర్మవరం అర్బన్: ధర్మవరంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం జడ్జిగా నియమితులైన ఉమర్ ఫరూఖ్‌ను శాలువాలు, పూలమాలలతో న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్‌చౌదరి, కార్యదర్శి దస్తగిరి, ఉపాధ్యక్షులు సుబ్బారావు మాట్లాడుతూ ఉమర్ ఫరూఖ్ న్యాయవాది వృత్తిలో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడన్నారు. పరీక్షల్లో ప్రతిభ కనబరిచి జడ్జి పోస్టును సాధించడం గర్వకారణమని తెలిపారు. నూతన జడ్జిగా చిత్తూరు జిల్లా తంబళ్లపల్లి మండలంలోని కోర్టులో గురువారం బాధ్యతలు తీసుకోనున్నారని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వలసలు నివారించాలి

బత్తలపల్లి: వేసవి కాలంలో ఉపాధి హామీ కూలీలు వలస పోకుండా చర్యలు తీసుకోవాలని ఏపీఓ ఆదెప్ప ఉపాధి సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూలీలందరికీ పని కల్పించాలని సూచించారు. సమావేశంలో ఉపాధిహామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



నగదు అందిస్తున్న దృశ్యం

ఎన్‌పీకుంట: మండల కేంద్రానికి చెందిన టీస్టాల్ నిర్వాహకుడు కరీంఖాన్ కుమార్తె వివాహానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ రూ.10,000 ఆర్థిక సాయం అందించారు. బుధవారం బత్తల యువసేన సభ్యులు కరీంఖాన్ ఇంటికి చేరుకొని నగదు అందించారు. బత్తలకు కరీం కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులతో విదేశీ సాయిభక్తులు

నల్లమాడ: లండన్‌కు చెందిన భగవాన్ సత్యసాయి బాబా భక్తులు రంజిత్ బెన్, ప్రమోద్ తమ సేవాభావాన్ని చాటుకున్నారు. మండలంలోని పెమనకుంటపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. అలాగే పెమనకుంటపల్లి, అప్పయ్యగారిపల్లి గ్రామాల్లో ప్రతి కుటుంబానికీ ఓ చీర, పంచె పంపిణీ చేసినట్లు కార్య నిర్వాహకులు సోమగుట్ట సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు విదేశీ భక్తులకు స్వాగతం పలికి సాయి కీర్తనలతో భజనలు చేశారు.

‘సేంద్రియం’పై మక్కువ

- సేంద్రియ ఎరువులకు పెరుగుతున్న డిమాండ్
- ప్రోత్సహిస్తున్న వ్యవసాయాధికారులు

ఓడీ చెరువు: మారుతున్న కాలానికి అనుగుణంగా అన్నదాతల్లో కూడా మార్పు వస్తోంది. గుడ్డిగా పంటలు సాగు చేయకుండా తెలివితో పంట పెట్టుబడి ఖర్చులు తగ్గించుకొనే దిశగా అడుగులు వేస్తున్నారు. అన్నదాతను ఆర్థికంగా గట్టెక్కించాలని వ్యవసాయ శాఖాధికారులు సూచనలు సలహాలను ఇస్తూ సేంద్రియ ఎరువులను వాడాలని ప్రోత్సహిస్తున్నారు. దీంతో సేంద్రియ ఎరువులకు అన్ని చోట్లా డిమాండ్ పెరుగుతోంది.

భూసారం పెంపు దిశగా..

రసాయనిక ఎరువుల ద్వారా కలుగుతున్న అనర్థాలపై రైతుల్లో చైతన్యం వచ్చింది. దీంతో భూసారాన్ని పెంపొందించుకొనే దిశగా అడుగులు వేస్తున్నారు. పశువుల పేడ కుంటలు, చెరువుల్లో పేరుకు పోయిన రేగడి మట్టిని పొలాలకు తోలుతున్నారు. పశువుల పేడ లేని రైతులు పాడి ఎరువులను కొనుగోలు చేస్తున్నారు.

రసాయన ఎరువులతో అధిక ఖర్చు..

రసాయనిక ఎరువుల ధరలు రోజురోజుకు అమాంతంగా పెంచేస్తున్నారు. దీంతో రైతులు రసాయనిక ఎరువులకు అధిక ఖర్చు చేయాల్సి వస్తోంది. పెట్టుబడి ఖర్చు రానురాను పెరిగిపోతుంది. రసాయన ఎరువుల వాడకం వల్ల చీడపీడలు సోకి పంట దిగుబడి తగ్గిపోతోంది. ఈ విషయాన్ని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు ఎప్పటికప్పుడు తెలియచేయడంతో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గిస్తున్నారు. సేంద్రియ ఎరువుల వాడకంపై మొగ్గు చూపుతున్నారు.





వంచిరెడ్డిపల్లి వద్ద ట్రాక్టర్ ద్వారా పొలంలో సేంద్రియ ఎరువును తోలుతున్న దృశ్యం

రబీ సాగు ఇలా..

పుట్టపర్తి నియోజకవర్గం	: సుమారు 10 వేల హెక్టార్లు
ధర్మవరం	: 20 వేల "
కదిరి	: 12 వేల "

పశువుల ఎరువే వాడుతున్నా



సేంద్రియ ఎరువుల వాడకంతో తక్కువ ఖర్చు అధిక లాభసాటిగా ఉంది. డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల వాడకం వల్ల భూమి గట్టిబాడి పంటకు రోగాలు ఎక్కువ వచ్చేవి. పశువుల పేడ వాడకంతో భూమి గుల్ల బారి ఎక్కువ కాలం సత్తువ ఉంటోంది. రోగాలు కూడా తక్కువే. పంట దిగుబడి బాగా వస్తోంది. అందుకే ప్రతి ఏటా పశువుల ఎరువునే వాడుతున్నా.

– దుర్గాప్రసాద్‌నాయక్, మహమ్మదాబాద్ క్రాస్, రైతు

తక్కువ ఖర్చు.. అధిక లాభం



సేంద్రియ ఎరువు వాడకం ద్వారా రైతుకు అనేక లాభాలు చేకూరుతున్నాయి. పశువుల పేడ చెత్తతో కూడిన సేంద్రియ ఎరువు వాడకం వల్ల పంట పొలాల్లో ఎక్కువ కాలం భూమిలో తేమ వుంటుంది.తేమ ఎక్కువుగా వుండటం వల్ల చీడపురుగులు నశిస్తాయి. తెగుళ్లు కూడా తక్కువే. రైతుకు తక్కువ ఖర్చు అధిక ఫలసాయం లభిస్తుంది.

– ఇలియాజ్, మండల వ్యవసాయాధికారి, ఓడీ చెరువు

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి

బత్తలపల్లి: ఈ–క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ ఓబిరెడ్డి సూచించారు. బుధవారం ఆయన మండలంలోని పలు రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. పంట నమోదు చేసుకున్న రైతుల వివరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ–క్రాప్ నమోదు పకడ్బందీగా చేపట్టాలని సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లకు, ఎంపీఈఓలకు సూచించారు. పంట నమోదు వల్ల రైతులకు ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా, సున్నా వడ్డీ, పంట రుణాలు, కనీస మద్దతు ధర తదితర లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ వీరాంజనేయులు, సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు, ఎంపీఈఓలు తదితరులు పాల్గొన్నారు.

డ్రెస్‌కోడ్ పాటించకుంటే వేతనం కట్

- డీపీఓ విజయ్‌కుమార్ రెడ్డి



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న డీపీఓ విజయ్‌కుమార్‌రెడ్డి

ఓడీ చెరువు: గ్రామ సచివాలయ ఉద్యోగులు విధులకు (డ్రెస్‌కోడ్) యూనిఫాంతో హాజరు కాకుంటే వేతనంలో కోత విధించాలని డీపీఓ విజయ్ కుమార్‌రెడ్డి ఎంపీడీఓ పోలప్పను ఆదేశించారు. ఓడీ చెరువు గ్రామ సచివాలయం –1ని బుధవారం డీపీఓ ఆకస్మిక తనిఖీ చేశారు. యూనిఫాంతో హాజరు కాని ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓకు సూచించారు. రోజు వేతనం కట్ చేయాలని సూచించారు. చలానాలు ఎప్పటికప్పుడు ట్రెజరీ ఖాతాకు జమ చేయాలన్నారు. రికార్డులు అప్‌డేట్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పోలప్ప,సచివాలయ కార్యదర్శులు రామలింగారెడ్డి ప్రకాష్,సిబ్బంది పాల్గొన్నారు.

అనాథలకు వస్త్రదానం

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని గొట్లూరు అనాథాశ్రమంలోని వృద్ధులకు, అనాథలకు బుధవారం మల్కాపురం గ్రామానికి చెందిన ఎంబీఏ విద్యార్థిని అశ్విని జయంతి సందర్భంగా కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఆమె జ్ఞాపకార్థం వస్త్రదానం చేపట్టారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు పెద్ద నారాయణరెడ్డి, ఆదెమ్మ, వంశీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

పుట్టపర్తి టౌన్: నాబార్డు ఆర్థిక సాయంతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జీవామిత్ర సంస్థ అధ్యక్షుడు మంజునాథ పేర్కొన్నారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో ప్రశాంతి గ్రాంలో బుధవారం స్వయం సహాయక సభ్యులకు ఉచితంగా 15 రోజులు చీరల నేతపనిపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంకేతిక పరమైన విషయాలు అందిపుచ్చుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ సాయినాథరెడ్డి, మెప్మా అధక్షురాలు సాయిలీల, సీఈఓ రమాదేవి తో పాటు మహిళా సభ్యులు పాల్గొన్నారు.

1న మెగా రక్తదాన శిబిరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని పార్థసారథి నగర్ 24వ వార్డు సచివాలయంలో మార్చి 1న మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు చౌడేశ్వరిదేవి సేవా సమితి సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గర్భిణులు, తలసేమియా బాధిత పిల్లల కోసం శిబిరం నిర్వహిస్తున్నామని, దాతలు రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

పోటీని తట్టుకుని నిలబడితేనే విజయం

- కలెక్టర్ బసంత్ కుమార్

ప్రశాంతి నిలయం: పోటీని తట్టుకుని నిలబడితేనే విజయం సాధించగలరని కలెక్టర్ బసంత్ కుమార్ అన్నారు. సంస్కృతీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఈ నెల 25న పోటీ పరీక్షార్థుల కోసం నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమానికి సంబధించిన పోస్టర్లను బుధవారం ఆయన కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ యువత ప్రణాళికతో ముందుకు పోవాలన్నారు. అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సెంథిల్ కుమార్ మాట్లాడుతూ చెన్నైకి చెందిన ఐఆర్ఎస్ అధికారి లోక్‌నాథ్ రెడ్డితోపాటు పలు ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ప్రముఖులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డీన్ డాక్టర్ బాలకోటేశ్వరి, సిబ్బంది నాగరాజు, పవన్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ బసంత్ కుమార్

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

అమడగూరు: మండలంలోని చౌడేశ్వరీ కల్యాణ మండపంలో ఈ నెల 25, 26వ తేదీల్లో దుద్దుకుంట ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం ఫౌండేషన్ మెంబర్ డాక్టర్ సురేష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రముఖ వైద్య నిపుణులచే కంటి పరీక్షలు, కంటి ఆపరేషన్లు, ఉచిత కంటి అద్దాలు పంపిణీ, చెవి, ముక్కు పరీక్షలు, జనరల్ వైద్య పరీక్షలు, రక్త, మూత్ర పరీక్షలు చేసి అన్ని రకాల మందులు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, శివశంకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ జయప్ప, మాజీ కన్వీనర్ శేషూరెడ్డి, ఎంపీటీసీ పెద్దప్పయ్య, టౌన్ కన్వీనర్ సుధాకర్‌రాజు, సొసైటీ అధ్యక్షుడు బొట్టుస్వామి, నాయకులు నాగరాజు, వెంకటరెడ్డి, రంగారెడ్డి, సురేంద్రరెడ్డి, ఖాజాపీర్, హరినాథరెడ్డి, లోకేష్‌రెడ్డి, శంకర, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అధికారుల సూచనలు పాటించాలి

పుట్టపర్తి అర్బన్: అధికారుల సూచనలను రైతులు పాటించాలని ఉద్యానశాఖ అధికారులు పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి మండలం అమగొండపాళ్యం గ్రామంలో తోటబడి కార్యక్రమాన్ని ఉద్యానశాఖ అధికారి రాంప్రసాద్, సహాయకులు వేమారెడ్డి నిర్వహించారు. ఉద్యాన రైతులు తోటబడి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సాధారణంగా ఫిబ్రవరి మాసంలో మామిడి చెట్లు పిందె దశకు చేరుకుంటాయన్నారు. పిందె రాలకుండా ప్లానోఫిక్స్ ఒక మిల్లీ లీటరుకు 4.5లీటర్ల నీటిని కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. తామర పురుగు, మంచు పురుగు ఉన్నప్పుడు ఫిప్రోనిల్ మందును 2 మిల్లీ లీటరుకు లీటరు నీటిని లేదా అసిఫేట్ మందును 1.5 గ్రాములకు లీటరు నీటిని కలిపి పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. గ్రామాల్లో తోటబడి కార్యక్రమాలు నిర్వహించే సమయంలో రైతులు విరివిగా పాల్గొంటే, రోగ నివారణ చేసుకొనే వెలుసుబాటు ఉంటుందన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

అప్పర్ భద్ర ప్రాజెక్టును వ్యతిరేకిద్దాం

పుట్టపర్తి అర్బన్: అప్పర్ భద్ర ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ చేపట్టిన పాదయాత్రను విజయ వంతం చేయాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి మండలం ప్రశాంతిగ్రామంలోని వినాయకుని ఆలయం వద్ద స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల సమక్షంలో పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా స్టీరింగ్ కమిటీ సభ్యులు రామక్రిష్ణ, ఓబుల్‌రెడ్డి, నాగభూషణ, సంతోస్ మాట్లాడుతూ ప్రజాసంఘాలతో కలిసి పోరాడుతామన్నారు. తుంగభద్రపై ఆధారపడి కొనసాగుతున్న హెచ్ఎల్‌సీ, ఎల్ఎల్‌సీ, ఆర్డీఎస్, కేసీ కాలువల నికర జలాలను సాధించడానికి ఈనెల 25 నుంచి పాదయాత్రను రాజోలిబండ నుంచి ఆదోని వరకూ స్టీరింగ్ కమిటీ అధ్యక్షులు బైరెడ్డి రాజశేఖరరెడ్డి ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. అప్పర్ భద్ర ప్రాజెక్టు పూర్తయితే రాయలసీమకు వచ్చే జలాలు లేక వ్యవసాయం పూర్తిగా నష్ట పోతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, గురుప్రసాద్, ఆదిరెడ్డి, బాబుల్‌రెడ్డి, మధుసూధన్, బాబు, ఈశ్వరప్ప, రవినాయక్, గోపాల్‌రెడ్డి, సూరి , హరి తదితరులు ఉన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న స్టీరింగ్ కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

‘పుట్టపర్తికి రైలు సర్వీసు పొడిగించాలి’

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో పని చేస్తున్న ఉద్యోగుల కుటుంబాలు చాలా వరకూ అనంతపురంలో ఉండడంతో ఉద్యోగుల సౌకర్యార్థం విజయవాడ–ధర్మవరం రైలును పుట్టపర్తి వరకూ పొడిగించేలా రైల్వే అధికారులకు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ బసంత్‌కుమార్‌కు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం వినతి పత్రం అందజేసింది. బుధవారం కలెక్టరేట్‌లో పలువురు ప్రతినిధులు కలెక్టర్‌ను కలిశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ప్రొబేషన్ విషయం, ఏఎన్ఎంల యాప్‌ల భారం, కొత్త జిల్లా ఉద్యోగులకు 16 శాతం హెచ్ఆర్ఏ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి నూతన కార్యాలయ భవనానికి స్థలం కేటాయించాలని విన్నవించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీజీఏ అధ్యక్షులు వీబీ భాస్కర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి బాబాఫకృద్దీన్, ట్రెజరర్ నారాయణరెడ్డి, అసోషియేషన్ ప్రెసిడెంట్ రమేష్‌బాబు, ఉపాధ్యక్షులు డాక్టర్ చెన్నారెడ్డి, వేమారెడ్డి, సుందర్‌రాజు, తిరుపాలు, విశ్వతేజ, శ్రీనివాసులు, గోవిందప్ప, జాయింట్ సెక్రెటరీలు ఉమామహేశ్వరరావు, శాంతలక్ష్మి, మల్లిఖార్జున, శివరాజు, సీడీపీఓల తాలూక అధ్యక్షురాలు సాంబశివమ్మ, తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీతోనే వాల్మీకులకు న్యాయం

కొత్తచెరువు: వైఎస్సార్ సీపీతోనే వాల్మీకులకు న్యాయం చేకూరుతుందని పలువురు వాల్మీకీ నాయకులు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఎమ్మెల్సీ స్థానాన్ని వాల్మీకి కులానికి చెందిన మంగమ్మకు కేటాయించడం పట్ల వాల్మీకులు సంబరాలు జరుపుకున్నారు. బుధవారం మండల కేంద్రమైన కొత్తచెరువు వాల్మీకి విగ్రహం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాన్ని ఉంచి క్షీరాభిషేకం చేశారు. వాల్మీకులకు ఇప్పటికే ఎన్నో పదవులు ఇచ్చారన్నారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ అభ్యర్థిగా సానేపల్లి మంగమ్మ, కర్నూలు ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ మధుసూదన్‌కు కేటాయించడం పట్ల హర్షం వ్యక్త ంచేశారు. పెద్ద ఎత్తున బాణ సంచా కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వాల్మీకి శంకర్,బీసీసెల్ ప్రధాన కార్యదర్శి బేల్దారి ఎల్లప్ప,సర్పంచు ప్రకాష్,వాల్మీకి సంఘం అధ్యక్షులు ఆవుల అశోక్,చేపల సంఘం అధ్యక్షులు మురళి, వాల్మీకి నాయకులు రాము, శ్రీరాములు, చింతకాయల కిష్టప్ప, నారాయణస్వామి, సూరి, డీలర్ మారుతి, శ్యాంపురం ఆంజనేయులు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వాల్మీకులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కనగానపల్లి: మండల పరిధిలోని ముక్తాపురం సమీపంలో 44వ నంబరు జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు.. రాప్తాడు మండలం మరూరుకు చెందిన నాగరాజు, రాజు అనే ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంలో మామిళ్లపల్లి నుంచి మరూరు గ్రామానికి వెళ్తున్నారు. అయితే ముక్తాపురం క్రాస్ వద్ద గుర్తు తెలియని వాహనం వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఇద్దరు యువకులు గాయపడ్డారు. హైవే పెట్రోలింగ్ పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని గాయపడ్డ యువకులను అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

నామినేషన్ కార్యక్రమానికి తరలివెళ్లిన నాయకులు

కదిరి అర్బన్: పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిల నామినేషన్ కార్యక్రమానికి బుధవారం కదిరి నియోజకవర్గం నుంచి నాయకులు తరలివెళ్లారు. ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి ఆధ్వర్యంలో మొత్తం 16 వాహనాలలో కదిరి ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి అనంతపురం బయలుదేరి వెళ్లారు. వైఎస్సార్‌టిఎఫ్ నాయకులు జంషీద్, ఇంద్రప్రసాద్‌రెడ్డి, పుల్లారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శివయ్య, శ్రీనివాసులు, పుల్లయ్య, బయపురెడ్డి, గంగాధర్‌రెడ్డి, పీఆర్‌టీయూ నాయకులు శ్రీధర్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, బాస్కర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం

పుట్టపర్తి: కొత్తగా ఏర్పడిన శ్రీ సత్యసాయి జిల్లాలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల కార్యాలయం కోసం స్థలం కేటాయించాలని జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి బృందం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. బుధవారం వారు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. పుట్టపర్తి కేంద్రంగా జిల్లా ఏర్పడడంలో ఎమ్మెల్యే కృషి మరువలేనిదని పేర్కొన్నారు.

ఘనంగా మంత్రి అప్పలరాజు జన్మదినం

కదిరి టౌన్: పట్టణంలో బుధవారం మంత్రి సీదిరి అప్పలరాజు జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. కదిరి నియోజకవర్గ బెస్త సంఘ అధ్యక్షుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పక్కీరప్ప, రవికుమార్, వెంకటేష్, రమణ, గోపి, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

26న ఉచిత గుండె వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సుందరయ్యనగర్ గణేష్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఈనెల 26న ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నామని 29వవార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ కోటిరెడ్డి సుజాత, వార్డు ఇన్‌చార్జ్ కోటిరెడ్డి బాలిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కిమ్స్ సవీరా ఆసుపత్రి వైద్యుల సహకారంతో ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు శిబిరం ఉంటుందని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ప్రతి కూలీకి పని కల్పించాలి

తనకల్లు: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ప్రతి కూలీకి పని కల్పించాలని ఎంపీడీఓ పూల నరసింహులు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై బుధవారం టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా దాదాపు 10 వేల జాబ్‌కార్డులు ఉన్నాయని తెలిపారు. అయితే ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీల సంఖ్య తక్కువగా ఉందని, వెంటనే ఆయా గ్రామాలలో పనులపై అవగాహన కల్పించి కూలీల సంఖ్య పెంచాలని ఆదేశించారు. కూలీల సంఖ్య పెంచని సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి కూలీకి 100 రోజులు పని కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పోతులప్ప, చెన్నకేశవ స్వామి ఉత్సవాలు ప్రారంభం



ఎలువగంపను ఊరేగిస్తున్న భక్తులు

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని పెద్దకమ్మవారిపల్లిలో పోతులప్ప చెన్నకేశవ ఉత్సవాలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎలువ గంప ఊరేగింపును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పోతులరాజులు సాంప్రదాయ దుస్తులు ధరించి ఉరుములు వాయిద్యాలతో పుట్టపర్తి పురవీధుల్లో ఊరేగింపుగా దేవాలయానికి చేరుకొన్నారు. పోతలప్పస్వామి, చెన్నకేశవ స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులతో ఆలయం ప్రాంగణం కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకొన్నారు. గురువారం ఉదయం పోతలప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం, కమ్మవారిపల్లి చింతతోపులో నవరత్నాలు నాటకం ప్రదర్శిస్తారు.